# కథ

ధనంజయ్‌కి చెస్ అంటే చాలా యిష్టం. ఆటలో పడి అన్నీ మరచిపోతాడు. చాలా బాగా ఆడ్తాడు కూడా. బాగా ఆడేవాళ్ళంటే గౌరవం.

క్లబ్బులో ఆడాలంటే రొద. అందరూ పేకాటవైపే పరుగు. శేఖరం బాగానే ఆడ్తాడు. కానీ దూకుడు ఎక్కువ. గంటల తరబడి సాగదు. ఆట మొదలు పెట్టిందగ్గర్నుంచీ ప్రత్యర్థి రాజుపైనే కన్ను. ఈలోగా తన బలం ఎంత పోతున్నా పట్టించుకోడు.

ధనంజయ్‌కి అతని చేతిలో ఓడిపోవడమంటే యిష్టం. ఆ మెరుపు దాడికి దిగ్భ్రమ చెందుతాడు. తాను గెల్చినప్పుడు ఆ సంతోషం ఉండదతనికి. చిన్న పిల్లల మీద ఆడిగెల్చినట్టుంటుంది, ఆ ఆట.

అసలు శేఖరానికి ధనంజయ్‌తో చదరంగం ఆడే తీరికేది? రమ్మీ వైపు పరుగెత్తుంటాడు. ఎంత పెద్ద స్టేక్ అయినా ఆడ్తాడు. నేల్లో గెలుస్తాడు, ఓడిపోతాడు. ధనంజయ్ నిట్టూరుస్తూ కూర్చుంటాడు.

క్లబ్బులో ఇంకా ఎవరైనా చెస్ ఆడ్తారేమోనని చూస్తాడు. ఒకరిద్దరు ఆడబోయినా అతనికిష్టం వుండదు. అది ఆటలా కాక ప్రాథమిక విషయాలను బోధించే డిమాన్‌స్ట్రేషన్‌లా అన్పిస్తుంది. అతనికి రాను రానూ క్లబ్బంటే విసుగు పుడుతోంది. అప్పుడు తటస్థపడ్డాడు మూర్తి.

మూర్తి ఆ ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ై వచ్చిన రోజునే ధనంజయ్‌కి అతనంటే సదభిప్రాయం ఏర్పడింది. అతని మాటతీరూ, నవ్వూ ధనంజయ్‌కెంతో నచ్చాయి. అందుకే మూర్తి తన సబార్డినేట్ అయినా అలాంటి భావంలేకుండా స్నేహ పూర్వకంగా వుంటాడు. మూర్తి కూడా ఎలాంటి అనవసరపు చనువూ తీసుకోడు. సంభాషణలో ఎంతో చతురత కనబరుస్తాడు.

మూర్తితో కూర్చుని టీ తాగుతూ ఓ అరగంట గడిపితే ప్రాణానికి హాయిగా వుంటుంది. పుస్తకాలపైనా, సినిమాల మీదా ఇంకా అనేక విషయాల మీద చక్కటి విశ్లేషణ చేస్తాడు. ధనంజయ్ చెప్పేది శ్రద్ధగా వింటాడు. అలాంటి మూర్తి చెస్ బాగా ఆడ్తాడని తెలిసిన రోజున ధనంజయ్ సంతోషం ఇంతా అంతా కాదు.

ఆ తరువాత చాలా సార్లు ఇద్దరూ కూర్చుని గంటల తరబడి ఆడుతూ వుండేవారు. మూర్తి ఎంతో నిదానంగా బాగా ఆలోచించి ఎత్తులు వేస్తాడు. ఆట సాగినంత సేపూ ధనంజయ్ తన బలగాన్నీ ఎదుటి బలగాన్నీ సరి చూసుకుంటుంటాడు. ఎప్పటికప్పుడు మూర్తిదే పైచేయిగా కనిపిస్తుంది. ఈసారి ఓడిపోవడం ఖాయమని ప్రతిసారీ అనుకుంటూంటాడు. కానీ చివర్లో ఏదో అద్భుతం లాంటిది జరిగి ఎక్కువసార్లు తనే గెలుస్తూ వుంటాడు. —

మూర్తి ఆటలో చివరికేదో చిన్న పొరపాటు దొర్లుతుంటుంది.

రానురానూ మూర్తితో చదరంగం ఆడడమే ధనంజయ్‌కి అతి ఇష్టమైన కార్యక్రమంగా మారింది. ఒక్కోసారి ఆట పూర్తయ్యేప్పటికి అర్థరాత్రి కావస్తూంటుంది. అయినా మిత్రులిద్దరికీ చెస్ బోర్డు వైపే ధ్యాస. పరిసరాల స్పృహ ఏ మాత్రం వుండదు. ధనంజయ్ ఇంటి ముందు లాన్‌లో కుర్చీలు వేసుకుని ఆడుతూ వుంటారు. వేసవి అంతా అలా గడిచిపోయింది.

వర్షాకాలం వచ్చిం తరువాత ఈ కార్యక్రమానికి అంతరాయం ఏర్పడింది. వరసగా కొన్ని రోజులు మూర్తితో ఆడకపోతే ధనంజయ్‌కి పిచ్చెక్కేది. అప్పుడప్పుడూ ముందు గదిలోకి చేరేవారు మిత్రులిద్దరూ.

ఇంట్లో కూర్చున్నప్పుడు ధనంజయ్ అంత మనస్ఫూర్తిగా ఆడలేక పోయేవాడు. మూర్తి కొంత ఇబ్బంది పడ్డాడు. అతని కుతూహలం కొన్ని విష-యాల్ని అతని దృష్టిలోకి తీసుకొచ్చింది. మిసెస్ కౌసల్యా ధనంజయ్‌కి మ్యూజిక్ అంటే ఇష్టం. ఎంతో కష్టపడి మంచి సంగీతాన్నీ, పాటల్నీ సేకరిస్తూ వుంటుంది. ఇద్దరు పిల్లల్నీ చెరో ప్రక్కనా కూర్చో బెట్టుకుని వాళ్ళతో రైమ్స్ చెప్పించడం, ఏవో పాటలు పాడించడం, వాటిని టేప్ చెయ్యడం అంటే ఆమె కెంతో ఆనందం. ఎప్పుడూ అందులోనే మునిగి పోతుంది.

ఇదంతా ధనంజయ్ కాన్సన్‌ట్రేషన్‌కి అడ్డొస్తుందేమోనని మూర్తి భావించాడు. మూర్తి వచ్చేంత

## * హిప్నాటిజం ద్వారా అమ్మాయిల్ని వశపర్చుకోవచ్చా?

## * పొట్టిగా వున్నవారు అమితాబ్ అంత పొడవు ఎదగొచ్చా?

## * అందమైన అమ్మాయిల కళ్ళలోకి చూడగానే ఆకర్షింపబడతారా?

*"దొంగతనం చేసినవారిచేత నిజం చెప్పించవచ్చా?"

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

# వంటింటి చదరంగం

వరకు ధనంజయ్ కూడా ఆ సంగీత ప్రపంచంలోనే వుంటాడు. కానీ చదరంగానికే ప్రథమ తాంబూలం.

వర్షం లేని రోజుల్లోనే ఎక్కువగా చదరంగం సాగేది. ఇద్దరూ లాన్లో కూర్చోవచ్చు. ఇంట్లో వాళ్ళతో సంబంధం వుండదు. కొన్ని రోజులు విరామం లేకుండా వర్షం కురిస్తే చెస్ గోవిందా! చలికాలం ప్రవేశించడంతో ఆడాలంటే తప్పని, సరిగా ఇంట్లోకి చేరాల్సి వచ్చింది.

ఎవరింటికైనా భర్తతోనో, పిల్లల్తోనో కలిసి వెళ్ళి గడపటమంటే కౌసల్యకు సరదా. అది కూడా మూర్తి దృష్టిని దాటిపోలేదు. ధనంజయ్ సంసారిగా ఎవరింటికీ వెళ్లడు. ధనంజయ్ కుటుంబాన్నంతటినీ భోజనానికి పిలుద్దామని భార్య లక్ష్మితో చెప్పాడు.

"ఏం మీ బాస్‌ని కాకా పడుతున్నారా?" అని నవ్వుతూ అడిగిందామె. "అదేమకో" అన్నాడు మూర్తి.

కానీ అసలు విషయం లక్ష్మికి తెలియనే తెలిసిపోయింది. వాళ్లు రాగానే మిత్రులిద్దరూ మేడమీద రూములోకి చేరిపోయారు చదరంగం బల్ల మధ్యలో పెట్టుకుని. టీలూ, టిఫిన్లూ అక్కడికే వెళ్లాయి.

క్రింద లక్ష్మికి చాలా సున్నితమైన పరిస్థితి ఎదురైంది. కౌసల్య వస్తూ వస్తూ తన వంటావిడను కూడా తీసుకొచ్చింది. అది ఆమె పద్ధతి, దర్పం. అతిథుల సంఖ్య పెరిగిందనే బాధేమీ లేదు. కానీ ఆ వంటావిడ ధోరణే లక్ష్మికి పెద్ద చిక్కు తెచ్చి పెట్టింది.

వంటావిడ అనాలో, వంటచేసే పిల్ల అనాలో? సుమారు ఇరవయ్యేళ్లుంటాయి గౌరికి. స్టైల్‌లో గృహిణులిద్దర్నీ మించినట్లుంది. అన్నీ ప్రశ్నలూ, ఆరాలూ, ఆ తర్వాత ఏవేవో సూచనలూ!

వంటలు పూర్తయ్యాయని పైకి కబురు పంపినా మహామహులిద్దరూ ఎంతకూ దిగిరారు. అదేమంటే మీరు తినేయండని కబురు. సరే, వాళ్లందరికీ వడ్డించడం మొదలుపెట్టింది లక్ష్మి. పిల్లలిద్దరూ చాలా డిసిప్లిన్డ్‌గా పెరిగినట్లున్నారు. వాళ్ల మమ్మీ ప్రక్కన కూర్చుని నీట్‌గా తింటున్నారు. వాళ్లతో పాటు గౌరి కూడా కుర్చీలో కూర్చుని భోజనానికి సిద్ధపడటం లక్ష్మికి కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించినా సర్దుకుంది. కాని దాన్ని మించిన ఆశ్చర్యం ఏమిటంటే ఆ తర్వాత వడ్డించిన ప్రతి పదార్థానికీ ఏవో వ్యాఖ్యానాలు చేయడం సాగించింది.

"ఇదేమిటే! ఈ కూరలో ఉల్లిపాయలంత పెద్దవిగా తరిగారు. మా ఇంట్లో చాలా సన్నగా తరుగుతాం.. కదండీ అమ్మగారూ."

"అరే, ఈ పులుసులో కొత్తిమీర వున్నట్లు లేదే" "ఈ పెరుగు పచ్చట్లో ఉప్పెక్కువ వేసేసారు"

ఇలాంటి కామెంట్స్ భోజనం చివరికంటా వింటూనే వుంది లక్ష్మి. కౌసల్య గౌరిని ఏమీ వారించకుండా "ఔనౌను.. మనింట్లో అంతే" అంటూ ప్రతిదానికీ ఆమె మాటలకు వంత పాడటం లక్ష్మికి చిరాకు తెప్పించింది. మగవారిద్దరి భోజనాలు కూడా పూర్తయ్యాక ధనంజయ్ కుటుంబ సభ్యులంతా బయల్దేరారు.

"మీకనవసరంగా శ్రమ కల్గించామమ్మా లక్ష్మీ" అని మనస్ఫూర్తిగా నొచ్చుకుంటున్నాడు ధనంజయ్. "దాందేముందండీ, కానీ మా వంటలేమీ మీకు రుచికరంగా వున్నట్టు లేదు" అంటూ కౌసల్య ముఖంలోకి చూస్తున్న భార్యవైపు, ప్రత్యర్థి 'షా' చెప్పినప్పుడు ఆటగాడు పొందే తికమకతో చూశాడు మూర్తి. ఏమీ బోధపడలేదు. వాళ్లు వెళ్లిపోయిన తర్వాత గౌరీ ప్రహసనమంతా విన్నాకగానీ అర్థం కాలేదు.

కాలం గడిచిపోతోంది. మిత్రులిద్దరి చదరంగ కార్యక్రమం సాగుతూనే వుంది. "వాళ్లని భోజనానికి పిలుద్దాం" అన్నాడొక రోజు మూర్తి భార్యతో. క్షణం సేపు తదేకంగా తనవైపు చూసిన భార్య ముఖంలో అనేకాలోచనలు కన్పించినై మూర్తికి. "సరే. పిలవండి. సాయంకాలం మీరు తిన్నగా ఇంటికి వచ్చేయండి"

మూర్తి ఆఫీసు నుండి ఇంటికి వచ్చి నోరు వెళ్లబెట్టాడు. తాపీగా బయట మొక్కలకు నీళ్లు పెట్టుకుంటోంది లక్ష్మి. వంట ప్రయత్నమేమీ వున్నట్టు లేదు. లోపలకు వెళ్లగానే టిఫిన్, కాఫీ తన ముందుంచింది. కాఫీ త్రాగుతూ తల పైకెత్తిన మూర్తి చెస్ బోర్డుతో కన్పించిన లక్ష్మిని అయోమయంగా చూశాడు.

"మీ బాస్ వచ్చేలోపుగా నాక్కూడా రెండెత్తులు నేర్పండి" అని తన ముందుంచింది.

"ఇదేమిటి? నీవింత తీరిగ్గా.. వంట సంగతి.."


"దాని దారిన అది అవుతూనే వుందిలెండి"

"అదెలా? ఏమయినా కొత్తరకం మెషీన్ వచ్చిందా?"

"అదేం కాదు. గౌరి చేస్తోంది. 'కిందటిసారి మా వంటలు మీకంత రుచికరంగా వున్నట్టనిపించలేదు నాకు. వంట చేసేప్పుడు కాస్త సూపర్‌వైజ్ చేస్తూంటుంది మీ గౌరిని పంపించండి' అని కౌసల్యగారికి ఫోన్ చేసాను. ఆమె కూడా సంతోషంగా సరేనని గౌరిని పంపించింది. ఆమె వంట గదిలో, నేను ముందు గదిలో."

మూర్తి తేరుకుని నవ్వేస్తూ "ఇంకా నీకెత్తులు నేర్పేదేమిటే?" అని ఫోన్ దగ్గరికి నడిచాడు ధనంజయ్‌ని వెంటనే రమ్మని చెప్పడానికి.

— వడ్లమూడి ప్రభావతీదేవి



అమెరికాలో హిప్నాటిజంలో శిక్షణ పొంది, సైకాలజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి, సమర్థవంతంగా చికిత్స చేస్తున్న శ్రీ బి.వి. పట్టాభిరావ్ పై ప్రశ్నలకి ఇచ్చే వివరణ వచ్చే సంచికలో...

ఇలా ఎందరికో, ఎన్నెన్నో అనుమానాలు. ఈ అనుమానాలు వచ్చేది ఐదోక్లాసు దాకా చదివిన వారికా? అంటే కాదు, డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వొకేట్లు నుండి ప్రొఫెసర్లు ఇలా అన్ని రంగాలకు చెందినవారూ ఉన్నారు. దీనికి కారణం హిప్నాటిజం గురించి సరైన గాహన లేకపోవడం, ప్రచార సాధనాలు తగినంత ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఎప్పుడో ఇక్ష్వాకుల కాలంనాటి పుస్తకాలు చదివి అదే హిప్నాటిజం అనుకోడం, అయితే ఈ అవసరాన్ని గుర్తించి 'ఆంధ్రజ్యోతి' ఈ రంగంలో నిష్ణాతుడైన వ్యక్తితో వివరణ ఇప్పించాలని నిశ్చయించింది.

## వచ్చే సంచికలో నిజం... నిజం... హిప్నాటిజం!